ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

గురువారం 12 జూన్ 2025





ఉష్ణోగ్రత (అంచనా) 12-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	26
తెనాలి	35	26
నరసరావుపేట	32	25
బాపట్ల	35	27
రెంటచింతల	31	26
చీరాల	35	27



గణ.. గణ..

- నేటి నుంచి బడులు పునః ప్రారంభం
- విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీకి కార్యాచరణ
- సన్న బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం
- కొలిక్కివస్తోన్న బదిలీలు.. తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- 20న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం



గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి.. వాతావరణం చల్లబడింది.. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఆట పాటల్లో ఇంతకాలం సందడి చేసిన విద్యార్థులు బడికి బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు నెలా 45 రోజుల తర్వాత పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. ఇందుకు అను గుణంగా పాఠశాలల్ని ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. పునః ప్రారంభం తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన తరగతులను విద్యాశాఖ నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేలా నూతన ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా అనేక నూతన సంస్కరణలు ఈ ఏడాది నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. పాఠ్య, నోట్ బుక్స్, యూనిఫాం, బూట్లు, టై, బ్యాగుతో కూడిన కిట్లు పాఠశాలలకు చేరుకున్నాయి. వాటిని గురువారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. పాఠశాలల్లో కొరత లేకుండా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బదిలీల ప్రక్రియ తుది దశకు రావడంతో మరో వారంలో పూర్తిస్థాయిలో పాఠశాలలకు ఉపాధ్యాయులు రానున్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు ఈ నెల 20న పాఠశాలల్లో మెగా పేటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీట్) నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు రానున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతోనే భోజనం అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పాఠశాలలకు సన్న బియ్యం తరలించినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పారు. కూరలతో పాటు మెనూలో మార్పులు రానున్నాయి. తల్లికి వందనం కార్యక్రమాన్ని కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది.



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలు

రుణ లక్ష్యాలు.. ఖరారు

- రంగాల వారీగా సిద్ధం చేసిన లీడ్‌బ్యాంక్
- ఎంఎస్‌ఎంఈ లక్ష్యం రూ.18,043.49 కోట్లు
- విద్యకు రూ.342.98 కోట్లు..
- గృహ రుణాలు రూ.1,217.78 కోట్లు

రూ. 19,604.25 కోట్లతో ప్రణాళిక



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.19,604.25 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను లీడ్ బ్యాంక్ సిద్ధం చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు విద్య, గృహ రుణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. ఆయా రంగాలకు సంబంధించి ఆర్థిక సహాయం అందిం చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. రాయితీ రుణాలు కూడా అందజేస్తున్నాయి. సదరు సంస్థలకు అందజేసే రుణాల ద్వారా కార్యకలాపాలను విస్తరించడానికి, కొత్త ఆవిష్కరణలకు రుణాలు దోహద పడతాయి. సకాలంలో రుణాలు అందక సదరు సంస్థల నిర్వాహకులు ఆర్థికంగా ఇక్కట్లు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎంఎస్ఎంఈలను గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో స్థాపిం చడానికి, ప్రోత్సహించేందుకు రాయితీ రుణాలను ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులకు ఎటువంటి ష్యూరిటీ లేకుం డా విద్యా రుణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం సూచించింది. విద్యా రుణాలు పల్నాడు జిల్లాలో 3777, గుంటూరు జిల్లాలో 11,288, బాపట్ల జిల్లాలో 4,971 విద్యార్థులకు రుణాలు ఇచ్చేందుకు లీడ్‌బ్యాంకు లక్ష్యాలు నిర్దేశించింది.

జిల్లాల వారీగా రుణ ప్రణాళిక ఇలా ఉంది

జిల్లా	ఎంఎస్‌ఎంఈ రుణాలు (కోట్లలో..)	విద్య రుణాలు (కోట్లలో..)	గృహ రుణాలు (కోట్లలో..)
పల్నాడు	2,604.99	74	293.34
బాపట్ల	1,291.50	70.29	184.50
గుంటూరు	14,147	198.69	739.94

క్యాటగిరీలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా రుణ లక్ష్యాలు ఖరారయ్యాయి. 2025- 26కు సంబంధించి లక్ష్యాలను లీడ్‌బ్యాంక్ నిర్దేశించింది. బ్యాంకుల వారీగా రుణాలకు సంబంధించి టార్గెట్లను ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో ఆయా రంగాలలో రూ.19,604.25 కోట్ల రుణాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించ నున్నారు. విద్య, గృహ రుణాలకు పెద్ద పీట వేయనున్నారు. విద్యకు సంబం ధించి 20,036 మంది విద్యార్థులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు లక్ష్యాలు ఇచ్చారు. లక్ష్యాల మేర రుణాల పంపిణీ చేస్తే ఆయా వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. వివిధ రంగాలకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు(ఎంఎస్‌ఎంఈ)లకు భారీగా రుణాలు పంపిణీ చేయనున్నారు.

ఆచరణ శూన్యం

ఏటా రుణ ప్రణాళిక ఘనంగా ఉన్నా ఆచరణ శూన్యంగా ఉంటుందన్న విమర్శలున్నాయి. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తుదారులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఎటువంటి హామీ లేకుండా కొన్ని రకాల రుణాలను మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేసినా వాటిని బ్యాంకు లు పట్టించుకోవడంలేదు. తీసుకున్న రుణానికి తగిన విధంగా ష్యూరిటీ ఇస్తేనే రుణం మంజూరు చేసే పరిస్థితి నెలకొంది. విద్యా రుణాలకు కూడా బ్యాంకులు ఆస్తులను హామీగా తనఖా పెట్టించుకుంటున్నాయి. బ్యాంకర్ల తీరుపై బాధితులు ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అనేక ఆంక్షలు విధిస్తున్నాయి. గత ఏడాది ప్రకటించిన ప్రణాళికలో నామమాత్రంగా కూడా రుణాలను బ్యాంకులు మంజూరు చేయ లేదని లెక్కలు తెలియజేస్తున్నాయి. రుణ ప్రణాళిక ప్రకటించడం.. బ్యాంకులకు లక్ష్యాలు ఇవ్వడంతో తమ పని అయిపోయిందని లీడ్ బ్యాంకులు భావిస్తున్నాయి. ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయా లేదా అన్న అంశంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకుండా పోయింది.



నేడు.. ఏడాది విజయోత్సవాలు

వేడుకలకు కూటమి శ్రేణులు సిద్ధం ● బైక్‌ర్యాలీలు.. కేక్ కటింగ్‌లకు ఏర్పాట్లు
● అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల అరాచకం.. అకృత్యాలతో.. అల్లాడిన ఓటర్లు పోటెత్తడంతో వైసీపీ పాలన అంతమై కూటమి అధికారం చేపట్టి గురువారంతో ఏడాది అవుతుంది. గత ఏడాది జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగ్గా.. అదే నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనా పగ్గాలు చేపట్టింది. నాడు పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకార మహోత్సవం జరగ్గా.. అది గురువారానికి ఏడాది అవుతుంది. ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో నిర్వహించే వేడుకల్లో ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో విజయోత్సవాలకు కూటమి శ్రేణులు సిద్ధమయ్యారు. గురువారం అన్ని నియోజకవర్గాల్లో ఏడాది పాలనా ఉత్సవాలను ఘనంగా కూటమి శ్రేణులు జరుపుకోనున్నాయి. ఇందుకోసం అన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేశారు. యువత ఆధ్వర్యంలో పట్టణాల్లో బైక్‌ర్యాలీలు నిర్వహించనున్నారు. కేక్ కటింగ్‌లతో పాటు బాణసంచా పెద్దఎత్తున కాల్చేందుకు శ్రేణులు సిద్ధమయ్యాయి. ప్రదర్శనలతో పాటు సంబరాలను జయప్రదం చేయాలని కూటమి నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏడాది విజయోత్సవ సంబరాల ద్వారా ప్రజలకు నేతలు వివరించనున్నారు. ఈ ఏడాదిలో నియోజకవర్గాల్లో కూటమి నేతృత్వంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయనున్నారు.

సరికొత్తగా సంక్షేమ వసతి గృహాలు

● మంగళగిరిలో శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో సంక్షేమ వసతిగృహాలు సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులతో ఆధునిక వసతులతో హాస్టళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చాయి. రూ.11.50 కోట్లతో మంగళగిరి, పెనుమాక, దుగ్గిరాలలో మూడు హాస్టళ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. నంబూరు వీవీఐటీ చారిటబుల్ ట్రస్టు రూ.4.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మంగళగిరి గణపతినగర్‌లో నిర్మించనున్న బాలికల హాస్టల్ నిర్మాణానికి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి పనులు పూర్తై విద్యార్థులకు హాస్టళ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, టీటీడీ ధర్మకర్త తమ్మిశెట్టి జానకీదేవి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, తహసీల్దార్లు దినేష్ రాఘవేంద్ర, ఐ.సునీత, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ గుప్తా, సోషల్ వెల్ఫేర్ డీఈ డి.రాము, ఏఈ నరేంద్ర, ఏఎస్‌డబ్ల్యూవో రామారావు, డీసీ చైర్మన్ జీ.అనిల్, ఎంపీపీ షేక్ జబీన్, దుగ్గిరాల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, ఎంటీఎంసీ జనసేన అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.



బాలికల వసతి గృహం శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

స్పౌజ్ పింఛన్ల పంపిణీ వాయిదా

● మూడు జిల్లాల్లో 8,374 మందికి మంజూరు ● ఏడాది విజయోత్సవాలతో పింఛన్లకు అవాంతరం?

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటాలో నూతనంగా ఎంపికైన వారికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ వాయిదా పడింది. కూటమి కొలువు తీరిన జూన్ 12న అంటే గురువారం పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించిది. ఈ కార్యక్రమాల్లో ఎక్కడికక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీ కార్య క్రమా లకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండే అవకాశం లేదు. దీంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం వాయిదా వేసి నట్లు సమాచారం. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందినవారి జీవిత భాగస్వాములకు పింఛను పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈ కోటాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8,374 మంది అర్హత సాధించారు. గుంటూరు జిల్లా నుంచి 2,565 మంది, బాపట్ల జిల్లా నుంచి 2,715 మంది, పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు. వీరందరికీ త్వరలోనే పింఛన్లు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

మహిళా సాధికారతలో ఆదర్శంగా తెనాలి

ప్రత్యేక కార్యక్రమాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దుతాం ● మహిళా సాధికారత భవన ప్రారంభోత్సవంలో మంత్రి మనోహర్

తెనాలిరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతలో తెనాలిని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పట్టణంలోని కొత్తపేటలోని భవనాన్ని మహిళా మండలి సభ్యులు డాక్టర్ కస్తూరిబాయి, డాక్టర్ గోగినేని ఉమలు ప్రభుత్వానికి గతంలో అందజేయగా రూ.20 లక్షలతో ఆధునీకరించి మహిళాసాధికారత భవనంగా నామకరణ చేశారు. దానిని బుధవారం దాతలతో కలిసి మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ సహకారంతో రాబోయే రోజుల్లో మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా కార్యక్రమాలు చేపడతామన్నారు. దాతలు డాక్టర్ కస్తూరిబాయి, డాక్టర్ గోగినేని ఉమలను మంగళవాయిద్యాల నడుమ మంత్రి మనోహర్ స్వయంగా భవనంలోకి తీసుకువెళ్లి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, తహసీల్దారు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దాతలతో కలిసి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

ఎట్టకేలకు ఎస్జీటీలకు కౌన్సెలింగ్

- తొలిరోజు 350 మందికి బదిలీలు పూర్తి
- జడ్పీలో అర్ధరాత్రి వరకు సాగిన ప్రక్రియ

గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యలతో మంగళవారం నిలిచిపోయిన ఎస్జీటీల కౌన్సెలింగ్ బుధవారం ఎట్టకేలకు జరిగింది. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో తొలిరోజు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీలకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఒకటో నంబరు నుంచి 750 నెంబరు వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. రాత్రి 9 గంటల వరకు 350 మందికిపైగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతకముందు జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు డీఈవోలు రేణుక, చంద్రకళ, జేడీ శైలజ, పరిశీలకులు లక్ష్మీకుమారి, సహాయ సంచాలకులు శైలజబాయి, ఆర్.రమణ, తదితరులు పాల్గొన్నారు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గురజాల శాసనస భ్యులు యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్నా డులో శాంతి భద్రతలు బాగుండటంతో పాటు గతంలో వున్న ఫ్యాక్షన్ పూర్తిగా తగ్గిపోవడంతో పాటు నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యరపతినేని హరీష్‌కుమార్ గుప్తాకు వివరించారు. ఈ సందర్భంగా డీజీపీకి తిరుపతి ప్రసాదాన్ని యరపతినేని అందజేశారు.



డీజీపీకి తిరుపతి ప్రసాదం అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

సరికొత్త రంగుల్లో ఆర్టీసీ బస్ పాస్‌లు

- నేడు, రేపు బస్ పాస్‌ల కౌంటర్లు మూసివేత
- 14 నుంచి యథావిధిగా కొత్త పాస్‌లు జారీ

గుంటూరు, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఇప్పటి వరకు జారీ చేస్తోన్న రాయితీ బస్ పాస్‌లు ఇకపై సరికొత్త రంగుల్లో అందించనున్నారు. ఈ మేరకు కొత్త రంగులతో పాస్‌లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందు కోసం పాత స్టాక్‌ను నిలిపివేసి కొత్త రంగుల్లో జారీ చేసేందుకు గురు, శుక్రవారాలు ఆర్టీసీ బస్టాండ్‌లలో బస్ పాస్ కౌంటర్లు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. 14వ తేదీ నుంచి యథావిధిగా బస్ పాస్ కౌంటర్లు పనిచేస్తాయని, కొత్త రంగులతో పాస్‌లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో సీజనల్ పాస్‌లు, స్టూడెంట్ పాస్, ఐడీలతో పాటు వివిధ రకాల పాస్‌లను రాయితీపై అందిస్తున్నారు. కాగా బస్ పాస్‌లు గతంలో బ్లూ కలర్‌లో ఉండగా తాజాగా దాన్ని శాండల్ ఉడ్ కలర్‌లోకి మార్చారు. బస్ ఐడీ కార్డు గతంలో ఆరంజ్ కలర్‌లో ఉండగా తాజాగా దాన్ని సియాన్‌కలర్‌లోకి మార్చారు. ఈ మేరకు కొత్త రంగుల్లో కార్డులు జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు అన్ని ఆర్టీసీ బస్టాండ్‌లలోని బస్ పాస్‌ల కౌంటర్లు గురు, శుక్రవారాలు మూసివేయనున్నారు. పాత స్టాక్‌ను తొలగించటంతో పాటు సాంకేతిక వ్యవస్థను మెరుగు పరిచే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బస్ పాస్‌ల కోసం వచ్చే విద్యార్థులు ముందుగా తమ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందు పరిచి బస్ పాస్‌ల కౌంటర్ల వద్దకు రావాలని సూచనలు చేశారు. బస్ పాస్ కౌంటర్ల వద్దే పూర్తి వివరాలు నమోదు చేయటం, ధ్రువీకరణ పత్రాలు పరిశీలన వంటివి నిర్వహిస్తే రద్దీ పెరగటంతో పాటు సమయాభావం పెరిగే పరిస్థితులుంటాయని, ముందుగానే పాస్‌లు కావాల్సిన విద్యార్థులు వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏఎన్‌యూ అభివృద్ధికి సచ్చిదానందమూర్తి కృషి

ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి

పెదకాకాని, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు సామాజిక విలువలను పెంపొందించే తత్వ కేంద్రాలుగా విలసిల్లాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్దిస్ట్ స్టడీస్ విభాగం వద్ద ఏర్పాటుచేసిన తత్వవేత్త, యూజీసీ మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రంలో చేసిన కృషి, ప్రపంచ దేశంలోని పరిశోధకులను కూడా ఆకర్షించిందని తెలిపారు. ఆయన విద్యారంగంలో విలువలను అభివృద్ధి చేయడానికి కృషి చేశారని, ఏఎన్‌యూ సర్వతోముఖాభివృద్ధికి సచ్చిదానందమూర్తి ఎనలేని సేవలందించారని, ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కే గంగాధర్‌రావు మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి కృషివలన ఏఎన్‌యూలో మహాయన బౌద్ధ అధ్యయన కేంద్రం, శాస్త్రీయ సామ్యవాద కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య పాల్ కుమార్, ఆచార్య సిద్దయ్య, డాక్టర్ డీ రవిశంకర్ రెడ్డి, ఆచార్య దివ్యతేజ



విగ్రహావిష్కరణ చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కొత్త మధుమూర్తి

మూర్తి, ఆచార్య వీ వెంకటేశ్వర్లు, ఆచార్య రామచంద్రన్, ఆచార్య రవికుమార్, ఆచార్య ఆర్ శివరాం ప్రసాద్, ఆచార్య వీ సుధాకర్, ఆచార్య వై అశోక్‌కుమార్, ఆచార్య సుబ్బారావు, ఆచార్య కే వెంకట్రావు, ఆచార్య తులసీదాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు రాక

- దుగ్గిరాల రైతులకు జరిగిన నష్టంపై అధికారులతో సమీక్ష

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు గురువారం గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం గుంటూరు నగరం చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెటింగ్ కమిషనరేట్‌కు చేరుకొని దుగ్గిరాల ఏఎంసీ పరిధిలో గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులు నిల్వ చేసుకున్న పంట ఉత్పత్తులకు నష్టం జరిగింది. అయితే దీనికి సంబంధించి ఇప్పటివరకు రైతులకు నష్టపరిహారం బీమా కంపెనీల నుంచి విడుదల కాలేదు. ఈ అంశంపై ఆయన మార్కెటింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని అధికారవర్గాలు ఈ సందర్భంగా తెలిపాయి.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 21.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

నాటక రంగ అభివృద్ధికి సీఎం కృషి

- ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ

తాడేపల్లి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాటిక కళాపరిషత్ నూతన ఆఫీసును ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కళలు, కళాకారుల పట్ల ఎక్కువ మక్కువ ఉందని చెప్పారు. రెండోసారి నాటక అకాడమి చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఏపీలో నాటక వికాసానికి కళాకారులు రచయితలు, నటులు నటీమణులు, పరిషత్ నిర్వాహకులు దేవస్థాన కమిటీలు ఏపీలో నాటక పోషకులు ఎంత మంది ఉన్నారో వారందరి సహకారం చేతి కళాపోషకుల సహకారం తీసుకుని ముందుకు వెళతామన్నారు. నాటక రంగ అభివృదికి సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ ఎంతో అండగా ఉన్నారన్నారు. యువగళం పాదయాత్రతో సంచలనం సృష్టించిన యువ నేత నారా లోకేశ్ తనను చంద్రబాబు నాయుడుకి పరిచయం చేశారన్నారు. ఈ ప్రాంతంలో లోకేశ్ క్రీడా ప్రాంగణం ఉందని, దీనిని కళా ప్రాంగణంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్, కోగంటి ప్రసాద్, పీ నాగేశ్వరరావు, కే సత్యనారాయణ, వంశీ, హరిబాబు, నరసింహారావు, రంగనాయకులు, సాంబశివరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నాణ్యతని దెబ్బతీసే పురుగుమందులను నిషేధించాలి

- చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతల విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు ఎగుమతి అయ్యే మిర్చి నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా ఉండాలనే వివరాలను ఆయా దేశాల నుంచి కేంద్ర ప్రభుత్వం తెప్పించుకోవాలని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. అలానే పురుగు మందుల అవశేషాలు మోతాదుకు మించి ఉన్న వాటిని వివిధ దేశాలు తిరస్కరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ అవశేషాలు కలిగిన పురుగుమందులను రైతులు వినియోగించు కుండా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంటూరు మిర్చియార్డు ఆవరణలోని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో చర్చించిన వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, జనరల్ సెక్రెటరీ తోట రామకృష్ణ మీడియాకు వివరించారు. చైనా, అమెరికా, యూరప్ ఖండం దేశాలు ఎలాంటి నాణ్యత ప్రమాణాలు కోరుకొంటున్నాయో తెలుసుకొని వాటిపై స్పైసెస్‌బోర్డు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దాని వలన ఎగుమతుల తిరస్కరణలు అనేవి లేకుండా ఉంటాయని చెప్పారు. అప్పుడు రైతుకు, ట్రేడర్‌కు మేలు జరుగుతుందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతలు

ఎగుమతులు పెరిగినా ధర ఎందుకు పెరగలేదంటే...

చైనా దేశానికి ఏటా 2 లక్షల టన్నుల మిర్చి ఎగుమతి జరుగుతుంటుందని సాంబశివరావు, రామకృష్ణ తెలిపారు. అయితే ఈ సంవత్సరం 3 లక్షల టన్నులు ఎగుమతి అయిందన్నారు. ఇందుకు కారణం చైనాలోని రెండు ప్రావిన్స్‌ల లో ప్రతికూల పరిస్థితులేనని చెప్పారు. ఒక ప్రావిన్స్ లో మిర్చి విస్తీర్ణాన్ని పూర్తిగా తగ్గించేయగా, రెండో ప్రావిన్స్‌లో ప్రకృతి విపత్తులు కారణంగా నష్టం వాటిల్లిందన్నారు. ఈ కారణంగా ఎగుమతులు పెరిగాయే త ప్పా మార్కెట్ ధర పెరగలేదన్నారు. వాస్తవానికి మిర్చి ధర ఎక్కువగా ఉంటేనే తమకు సులభంగా టర్నోవర్ పూర్తి అయి లాభాలు వస్తాయన్నారు.

వర్షాలు కురిసి.. పంటలు బాగా పండాలి

- వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ) జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవి ద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం లాంఫాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని సాంప్రదాయ బద్ధంగా విత్తనాలు నాటి జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా విచ్చేసిన వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ, డాక్టర్ బీ శ్రీలక్ష్మీ, డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఏ మణి, డాక్టర్ డీ సంపత్‌కుమార్, డాక్టర్ జీ కరుణసాగర్, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ కే రాధిక, సహపరిశోధన సంచాలకులు డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమిలో పాల్గొన్న వీసీ శారద జయలక్ష్మీదేవి, అధికారులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, చైర్మన్ జీ శేషయ్యలు మాట్లాడుతూ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 14, 15 తేదీలలో ఏఎన్‌యూలో జరిగే ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అదేరోజు ఉదయం 6 గంటలకు ఒరిజనల్ వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డు తీసుకుని కోచ్ రవికుమార్‌కు రిపోర్ట్ చేయాలన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అథ్లెటిక్స్ సంఘం సభ్యులు

ఎంపికైన క్రీడాకారులు: పురుషుల విభాగంలో కృష్ణం నాయుడు, మోహిద్దీన్, వెంకట గురుశంకర్, రోషన్, ముజ్బర్, మదన్‌మోహన్, యుగంధర్, ప్రసన్నకుమార్, ప్రవీణ్ కుమార్, సుబ్రహ్మణ్యం మణికంఠ నాయక్, అబ్దుల్లా, అశోక్, ప్రేమ్ చంద్, తిరుపతిరావు, రాజమోహన్, ఎస్ శంకర్, దీపు, భరత్ కుమార్, డీ మణికంఠ. మహిళల విభాగంలో ఆశ, కే అంకమ్మ, డీ వైష్ణవి, కే రేష్మి, కృష్ణ రచన

పట్టుకున్నప్పుడు ఫుల్.. మధ్యలో గోల్‌మాల్

150 బస్తాలతో వెళ్లే లోడు.. 20 బస్తాలతో స్టేషన్‌కు

ప్రత్తిపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అక్రమ రేషన్ బియ్యం వ్యవహారంలో ప్రత్తిపాడు పోలీసుల తీరు ప్రజలలో నవ్వుల పాలు చేస్తుంది. ప్రత్తిపాడు నుంచి అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీస్ స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలో బియ్యం మినిలారీ లోడ్‌ను ప్రత్తిపాడు పోలీసులు పట్టుకున్నారు. సుమారు అరగంట సేపు సోదాలు.. మాటలు జరిగాయి. ఇవి అంతా కూడా అక్కడ ఉన్న ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. మిని లారీలో సుమారు 150 బస్తాల లోడుతో ఉన్న విషయం స్థానికులు గమనించారు. ప్రజలందరి ముందు ఫుల్ లోడుతో అక్రమ రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న పోలీసులు దానిని స్టేషన్‌కు తీసుకు వచ్చే సరికి బక్క చిక్కి పోయింది. సుమారు 150 బస్తాలు ఉండాల్సిన లోడు లారీలో కేవలం ఇరవై బస్తాలు మాత్రమే దర్శన మిచ్చాయి. తాము 20 బస్తాలను మాత్రమే పట్టుకున్నట్లు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంలో ప్రత్తిపాడు ఎస్‌ఐ నాగేంద్రను వివరణ అడగ్గా 20 బస్తాలు మాత్రమే ఆ మిని లారీలో బియ్యం ఉన్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

త్వరలో నగరంలో స్ట్రీట్ వెండింగ్ జోన్ల గుర్తింపు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి వ్యాపారుల సంక్షేమానికి నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని, వెండింగ్ కమిటి ద్వారా త్వరలో నగరంలో స్ట్రీట్ వెండింగ్ జోన్ల గుర్తింపు జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగర కమిషనర్ చైర్మన్‌గా స్ట్రీట్ వెండింగ్ కమిటి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, వెండింగ్ కమిటీ గురువారం నుంచి నగరంలో వీధి వ్యాపారుల కోసం గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్ల ఏర్పాటుకు పరిశీలిస్తారన్నారు. ఇప్పటికే సచివాలయ కార్యదర్శుల ద్వారా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే జరుగుతుందని, వారం రోజుల్లో జోన్ల ఏర్పాట్ల పై కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వెండింగ్ జోన్లకు అవసరమైన ప్రాంతాలలో అంగీకారం తెలిపిన ప్రైవేట్ స్థలాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటామన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, పీవో రామారావు, వెండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు బొడ్డుపల్లి స్మిత పద్మజ, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పోస్టింగ్‌లు కల్పించారు. తహసీల్దార్‌గా అడహాక్ ప్రమోషన్ పొందిన సిద్దెల హెనాప్రియాని పెదనందిపాడు మండలం తహసీల్దార్‌గా నియమించారు. గుంటూరు తూర్పులో వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌పై తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ సుభానికి తూర్పు మండలంలోనే పోస్టింగ్ కల్పించారు. గుంటూరు జిల్లాకు కేటాయించిన కే.సంధ్యశ్రీని మంగళగిరి తహసీల్దార్‌గా పోస్టింగ్ కల్పించి గుంటూరు కలెక్టరేట్‌లోని సీఆర్‌డీఏ అడ్మిన్ విభాగానికి వర్కింగ్ ఎరేంజ్‌మెంట్‌పై బదిలీ చేశారు. వీళ్లతో పాటు తొమ్మిది మంది డిప్యూటీ తహసీల్దార్లను కూడా బదిలీ చేశారు. డీవీ శివపార్వతిని కలెక్టరేట్‌లో, ఏ మాధవిని పొన్నూరు, ఎం వెంకటరావుని సివిల్ సప్లయిస్ గుంటూరు, సుభాస్ హెచ్ఆర్ శర్మని దుగ్గిరాల, కే.కనక దుర్గని తాడేపల్లి, బిట్టు రమేష్‌ని గుంటూరు ఆర్‌డీవో ఆఫీసు, వై.ధర్మ తేజని కేఆర్‌ఆర్‌సీ, మునిపల్లి శివయ్యని మంగళగిరి ఎలక్షన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఇదేవిధంగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, ఆర్‌ఐలు, వీఆర్‌వో, వీఆర్‌ఏల బదిలీలు కూడా జరిగినట్లు సమాచారం.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంస్థ పరిరక్షణకు మహాసభల్లో ప్రధాన చర్చ ఉంటుందని తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సభకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరై సమస్యలపై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, ఎన్ వేణు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంబయ్య స్మారక పురస్కార ప్రదానం

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సిహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సి హెచ్ సాంబయ్య 36 వ వర్ధంతి, ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్ 16 వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి అతిథులుగా ఐ ఆర్ టి యస్ సీనియర్ డివిజనల్ అపరేషన్స్ మేనేజర్ ఎం దినేష్‌కుమార్, ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఒంగోలు ఆచార్య హరిబాబు, జీఎస్టీ అధికారి ఎన్.శ్రీనివాసరావు, దర్శకుడు, రచయిత కాపూరి సత్యనారాయణ, సి. చైతన్య తదితరులు పాల్గొని ఆచార్య అల్లం శ్రీనివాసరావును సీహెచ్ సాంబయ్య స్మారక పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం లేఖ్యా భరణి బృందం పలుకీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని, పూజిత, అర్చనలు పలుకీర్తనలకు భరత నాట్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి శారద వ్యాఖ్యాతగా వ్యవహించారు. తొలుత ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సిహెచ్ భాస్కరరావు అధ్యక్షత వహించారు.



ఆచార్య అల్లం శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో యోగా పోటీలు

గుంటూరు మెడికల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జూన్ 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు యోగాపై పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని ఆమె వివరించారు. ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు వైద్యాధికారి డాక్టర్ అబూబకర్‌ను (సెల్ నెంబర్: 89856 06125) సంప్రదించాలని డాక్టర్ విజయలక్ష్మి కోరారు.

ఏడాదిలోనే అభివృద్ధి వసంతం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే అభివృద్ధి వసంతం వచ్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మంత్రివారి వీధి, రైలు పేట, బొంగరాల బీడు ప్రాంతాలలో మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.26 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, పైపు లైన్ల నిర్మాణం వంటి 102 పనులు పూర్తి చేశామని వెల్లడించారు. రూ.27 కోట్లతో 82 పనులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా ద్వారా 71 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని తెలిపారు. నందివెలుగు బ్రిడ్జి, బీసీ బాలుర హాస్టల్ వంటి నిర్మాణాలు పట్టాలెక్కించామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ పోతురాజు సమత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధి తోటలకు స్థలాన్ని కేటాయించండి

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలో నాలుగు వైపుల క్రైస్తవుల సమాధి తోటలకు స్థలాలను కేటాయించాలని ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజాసుందరం బాబు కోరారు. అభివృద్ధి పనుల నిమిత్తం మంత్రి వారి వీధికి వచ్చిన ఎమ్మెల్యే నసీర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీలాకు ఆయన వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జే రవికాంత్, మద్దు ప్రేమ్‌జ్యోతి బాబు, సురేష్ జేమ్స్ తదితరులు ఉన్నారు.

వైద్య పరిశోధన రంగంపై ఆసక్తి చూపాలి

గుంటూరు మెడికల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసే డాక్టర్లు రోగుల చికిత్సలకే పరిమితం కాకుండా నూతన వైద్య పరిశోధనలపై ఆసక్తి చూపాలని స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు, నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావు కోరారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో బుధవారం జరిగిన శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) 13వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. విజయవంతంగా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులను పూర్తి చేసిన వైద్య విద్యార్థులకు టీటీడీ బోర్డు చైర్మన్, స్విమ్స్ ఛాన్సలర్ బీఆర్ నాయుడుతో కలసి సదాశివరావు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నన్నపనేని సదాశివరావు మాట్లాడుతూ తిరుపతిలోని స్విమ్స్, బర్డ్స్, చిల్డ్రన్స్ హాస్పిటల్ రోగులకు ఎనలేని వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రశంసించారు. తమ నాట్కో ట్రస్ట్ తరఫున గుంటూరు జీజీహెచ్‌లో రూ.20 కోట్ల వ్యయంతో అదనపు కేన్సర్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.



డిగ్రీని ప్రదానం చేస్తున్న సదాశివరావు, పక్కన బీఆర్ నాయుడు

25న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గుంటూరు పర్యటన

గుంటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 25న గుంటూరు పర్యటనకు రానున్నట్లు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లా నాయకులకు సమాచారం అందించారు. ఆమె రాజీవ్‌గాంధీ భవన్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు, భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పారు.

నేడు జగన్ గుంటూరు పర్యటన వాయిదా

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులు వేధిస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సత్తెనపల్లికి చెందిన వైసీపీ నాయకుడు లక్ష్మీనారాయణ నగరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. లక్ష్మీనారాయణను పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ ఈనెల 12న గుంటూరుకు రానున్నట్లు పార్టీ నేతలు ఇప్పటికే ప్రకటించారు. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో జగన్ పర్యటన వాయిదా వేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ప్రకటించారు.

నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో టోకరా

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామంలో మరో ఘరానా మోసం వెలుగు చూసింది. నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి తద్వారా నాలుగు కోట్ల 40 లక్షలకు పైగా రుణాలు తీసుకొని మహిళలను మోసం చేశారు. సంబంధిత బ్యాంకు నుంచి బాధిత మహిళలకు నోటీసులు రావడంతో వారు కంగుతిన్నారు. బ్యాంకు నుంచి లోన్లు తీసుకోకపోయినప్పటికీ తాము డబ్బు చెల్లించాలంటూ నోటీసులు రావడంతో వారు బ్యాంకుకు పరుగులు తీశారు. బ్యాంకులో విచారిస్తే తమ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు కోట్ల రూపాయలు రుణం తీసుకున్నట్లు గుర్తించారు. జీడీసీసీ బ్యాంకు, మెప్మా సిబ్బంది, గ్రామానికి చెందిన మరో మహిళతో పాటు కొందరు ముఠాగా ఏర్పడి ఈ భారీ మోసానికి పాల్పడినట్లు బాధితులు గుర్తించారు. బాధిత మహిళలు బుధవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా నల్లచెరువు, సంపత్‌నగర్, ఎత్తురోడ్డు, మూడుబొమ్మల సెంటర్, ఎన్‌హెచ్ 5 జాతీయ రహదారి ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రాజమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలానే జీటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిర్చియార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షిదయానందనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి 12 ఏఈ ఉదయ్‌కిరణ్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అరండల్‌పేట, శ్రీ మోహన రంగ నాయక స్వామి ఆలయ ఆవరణలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రధానమంత్రి మోదీ ప్రవేశ పెట్టిన అమ్మ పేరుతో ఓ మొక్క కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేలా నేటి తరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వక్కలగడ్డ తిరుపతిరావు, పెద్దంటి శ్రీ కృష్ణ, రవికుమార్, సుగుణ, వెలగలేటి గంగాధర్, భజరంగ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇంటి స్థలాలు, రైతులకు పెట్టుబడి సాయం, ఉచిత బస్సు ప్రయాణం, బీసీ మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు పరచలేదని విమర్శించారు. హామీలను నెరవేర్చకపోగా కార్మికులకు పనిగంటలు పెంపుదల చేయడం దారుణమన్నారు. ఇటువంటి విధానాలను ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, పచ్చల శివాజీ, అరుణ్‌కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్ని అవలంభించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

● జొన్నలగడ్డలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి యూ నరసింహారావు అన్నారు. రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన ఏరువాక పూర్ణమి వేడుకల్లో రైతులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఏరువాక సాగులో భాగంగా భూమి పూజ నిర్వహించి, అరకుతో దున్ని నవ ధాన్యాలను పొలంలో చల్లారు. సీజన్‌లో వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని ఆకాంక్షించారు. పురుగు మందులను తగ్గించి పంట దిగుబడులను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనివాసరావు, రాజకుమారి, సునీత, శివకుమారి, సర్పంచ్ మబ్బు శిరీష్, మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో చెరగని ముద్ర 'నున్న'

గుంటూరు సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన నున్న వెంకటేశ్వర్లు వ్యవసాయ శాఖలో చెరగని ముద్ర వేశారని పలువురు వక్తలు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని ఫర్టిలైజర్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో బదిలీపై వెళ్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లుకు బుధవారం ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఫర్టిలైజర్, సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. కొత్తగా వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి యు.నరసింహారావు మాట్లాడుతూ నున్న వెంకటేశ్వర్లు సేవలు ఎనలేనివని అన్నారు. ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ తనతో కలిసి పని చేసే వారికి నున్న వెంకటేశ్వర్లు మార్గదర్శిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రోజా మణి, ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యాం సుందర్, పలువురు ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.



వీడ్కోలు సభలో పాల్గొన్న డీఏఓ లు నున్న వెంకటేశ్వర్లు, నరసింహారావు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు

జిల్లా వ్యవసాయ అధికారిగా నరసింహారావు

గుంటూరు సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యవసాయ అధికారిగా నియమితులైన యు.నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది పూల బొకేలతో స్వాగతం పలికారు. జిల్లా కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించిన సీహెచ్ రోజామణి కూడా బాధ్యతలు స్వీకరించారు.



జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నరసింహారావు

జిల్లా ఆడిట్ అధికారిగా మధురిమ

గుంటూరు సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ఆడిట్ అధికారిగా బోయపాటి మధురిమ నియమితులయ్యారు. ఆమె ఇప్పటివరకు మంగళగిరిలోని రాష్ట్ర ఆడిట్ సంచాలకుల కార్యాలయంలో గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆడిట్ అధికారిగా పని చేశారు. ఇప్పటివరకు జిల్లా ఆడిట్ అధికారిగా వ్యవహరించిన బి.ధనలక్ష్మి రిలీఫ్ అకౌంట్స్ డీఏఓ (ఒంగోలు)గా నియమితులయ్యారు. జిల్లా ఆడిట్ కార్యాలయంలో బుధవారం మధురిమ నూతన బాధ్యతలు స్వీకరించారు. ఆడిట్ కార్యాచరణ ప్రణాళిక గురించి సిబ్బంది నుంచి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఆడిట్ అధికారులు పులిగడ్డ శ్రీనివాసరావు, అశోక్, బసవయ్య, చలమరాజు, రఫీ, ఆడిటర్లు పాల్గొన్నారు.



జిల్లా ఆడిట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బోయపాటి మధురిమ

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ కాలనీ, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వారి 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ దంపతులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహం, ఋత్విగ్వరణ, మేదిని పూజ, వాస్తు పూజ, అంకురారోపణ, ధ్వజా రోహణం, నీరాజనం, మంత్రపుష్పం వంటి సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి పరుగులు

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం రాకతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నియోజకవర్గంలోని 22, 24 డివిజన్ల పరిధిలో గుంటూరు మెడికల్ క్లబ్ వద్ద నుంచి చుట్టుగుంట జంక్షన్ వరకు రూ.50.00 లక్షలతో సెంటర్ డివైడర్ నిర్మాణం, కృష్ణబాబు కాలనీలోని గడ్డిమల్లు 5, 6 లైన్ అడ్డరోడ్లలో 49.90 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని, గత వైసీపీ పాలకులు ఈ నియోజకవర్గాన్ని, శివారు ప్రాంతాలను నిర్లక్ష్యం చేసి సమస్యల కూపంగా మార్చారని మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది అవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పిలుపు మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నామని, ఈ ర్యాలీలో ఎన్డీయే కూటమి నేతలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి, షేక్ నాగుర్, శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, షేక్ చిన్న మస్తాన్ వలి, ఆళ్ల హరి, చిన్నం శ్రీకాంత్ , చింతకాయల సాయి, అప్పిశెట్టి రంగ, తుమ్మల నాగేశ్వరరావు, కంచర్ల సాంబశివరావు, షేక్ బుడే, నంది సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి చంద్రబాబు.. పేదల ద్రోహి జగన్

● చైర్మన్ డేగల ప్రభాకర్



డేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : పేదల పెన్నిధి చంద్రబాబు అయితే.. జగన్ పేదల ద్రోహి అని ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ విమర్శించారు. గుంటూరులోని టీడీపీ నగర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం ఎన్డీఏ తప్ప మరేది లేదని డేగల ప్రభాకర్ తేల్చి చెప్పారు. గత వైసీపీ హయాంలో ఐదేళ్లలో 10 శాతం మాత్రమే హామీలు అమలు చేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలపై రూ.10 లక్షల కోట్లు రుణ భారం మోపిందని, ఏడాదికి సుమారు రూ.60 వేల కోట్లు వడ్డీ, అసలు చెల్లించాలని, దీనికి తోడు రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు పెట్టి పోయిందన్నారు. ఆ విధంగా రాష్ట్ర ఖజానా దివాళా తీసి ఉన్న పరిస్థితుల్లో అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం తన అనుభవం, ప్రతిష్ట, కఠోర కష్టంతో తొలి ఏడాదిలోనే 700లకు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం హామీలు అమలు చేయలేదన్నారు. నవరత్నాల్ని నవమోసాలు చేసి పేదలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. అమ్మఒడికి రూ.13 వేలు ఇచ్చి.. నాన్న బుడ్డిలో లక్ష రూపాయలు కొట్టేశారన్నారు. విషపూరిత మద్యం పోసి లక్షలాది మంది ఆరోగ్యాలు పాడు చేశారని మండిపడ్డారు.

జగన్ అరాచక పాలనకు ఏడాది క్రితమే పాతరేసిన ప్రజలు

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జగన్ అరాచకవాదాన్ని ప్రజలు సంవత్సరం క్రితమే పసిగట్టి పాతరేశారని వైసీపీ తెలుసుకోవాలని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ చెప్పేవి నీతి నినాదాలు, జగన్ చేసేవి ఉగ్రవాద కార్యకలాపాలు అంటూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు సంతోషంగా, ఆనందంగా ఉండటం ఇష్టంలేని జగన్ రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూస్తున్నాడని ఆయన విమర్శించారు. 29 రాష్ట్రాల్లో ఉన్న ప్రజలందరూ దేశాన్ని భారతమాతగా దేశ రాజధానిని తమ ఆత్మగౌరవ చిహ్నంగా భావిస్తారు. 13 ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తెలుగు తల్లిగా, రాష్ట్ర రాజధానిని ఆత్మగౌరవ పతాకగా భావిస్తారు. కానీ జగన్మోహన్‌రెడ్డికి జాతీయవాదం లేదు. రాష్ట్రం మీద గౌరవం లేదని విమర్శించారు.

ఆగ్రోస్ సెంట్రల్ వర్క్‌షాప్‌ను సందర్శించిన మాలేపాటి



ఏపీ ఆగ్రోస్ సెంట్రల్ వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ సుబ్బానాయుడు

గుంటూరు సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు సమీపంలోని నల్లపాడులో ఉన్న ఏపీ ఆగ్రోస్ సెంట్రల్ వర్క్ షాప్‌ను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు బుధవారం సందర్శించారు. ఈ కేంద్రంలో తయారయ్యే వ్యవసాయ యాంత్రిక పరికరాలైన రోటోవేటర్లు, సీడ్ డ్రిల్స్, కల్టివేటర్స్, మల్చర్, రౌండ్ బేలర్స్, స్క్వేర్ బేలర్స్, షుగర్ కేన్ ట్రాన్స్ ప్లాంటర్, పాడీ ట్రాన్స్ ప్లాంటర్ వంటి అన్ని పరికరాలను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో సంస్థ జనరల్ మేనేజర్ ఎం.సి రాజమోహన్, గుంటూరు జిల్లా మేనేజర్ ఆర్‌వీవీ నాగ మురళి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

Q A

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి....

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.



- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్ ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.


ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు.

- డాక్టర్ సుమతి, పీడియాట్రిషియన్, హైదరాబాద్

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి... మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి... తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు. ఇది దశాబ్దాల కిందటి కథ. మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి... తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది... మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి అపురూప సన్నివేశాలను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి... టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో... అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్, మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్లు రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతో. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్ తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

• హనుమా

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంత మంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే... నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగలుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కొవ్వై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

చెద పురుగులు పట్టాయా?

కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో; చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో



ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్దకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటిఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం....

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి



డైవింగ్ సంచలనం

ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లితండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లితండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, ఆప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో కైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగస్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెద్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎఐడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లో‌లో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

బీసీలకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం



కేసన శంకరరావు

మంగళగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు వెన్నుదన్నుగా అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలబెట్టేందుకే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అందరినీ ఒకే గాటిన కట్టి వెనుకబడిన తరగతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా నామమాత్రం చేశారన్నారు. అదే కూటమి ప్రభుత్వం రూ.వేల కోట్లను కేటాయించి ఆదుకుంటుందని తెలిపారు. ఉత్పత్తి కులాలైన బీసీల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావించిన సీఎం చంద్రబాబు బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు, బీసీ సంక్షేమ శాఖకు మరో రూ.23 వేల కోట్ల నిధులు కేటాయించారని హర్షం వ్యక్తం చేశారు. కులవృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న బీసీలకు పెద్ద ఎత్తున ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలతోపాటు విద్యుత్ సబ్సిడీ పథకం కూడా అమలు చేస్తుందన్నారు.



రాజధానిలో పర్యటిస్తున్న హిమాచల్ ప్రదేశ్ సెక్రటరీ ప్రబోధ్ సక్సేనా

రాజధానిలో హిమాచల్‌ప్రదేశ్ చీఫ్ సెక్రటరీ

తుళ్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో హిమాచల్‌ప్రదేశ్ చీఫ్ సెక్రటరి ప్రబోధ్ సక్సేనా బుధవారం పర్యటించారు. ఆయన విజయవాడ సీఆర్డీఏ కార్యాలయానికి వెళ్లి అక్కడి నుంచి ఉండవల్లి గృహల వద్దకు వచ్చారు. వాటి చరిత్రను సీఆర్డీఏ అధికారులు ఆయనకు వివరించారు. టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. వీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. రాజధాని మాస్టర్‌ప్లాన్ గురించి తెలుసుకున్నారు. అదనపు కమీషనర్ మల్లవరపు నవీన్, హిమాచల్‌ప్రదేశ్ ప్లానింగ్ విభాగ సలహాదారు డాక్టర్ బసు సూద్ ఈ పర్యటలో ఉన్నారు.

వధూవరులకు పెళ్లికానుక

తాడేపల్లి(పెనుమాక), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పెనుమాక గ్రామంలో మల్లవరపు నాగేశ్వరరావు కుమారుడు విజయ-సునీల్ వివాహానికి హాజరై మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుక, మంగళసూత్రాన్ని టీడీపీ నేతలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కొల్లి శేషు, గోవిందరెడ్డి, పాల్గొన్నారు. వడ్డేశ్వరంలో నూతన వధూవరులు యశోద-చలివేంద్ర కృష్ణంరాజులకు మంత్రి లోకేశ్ పంపిన పెళ్లికానుకను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, బొర్రా కృష్ణవందన, వడ్డేశ్వరం అబ్రహం, షేక్ ఇమాంసా, నాగుర్‌వలి, తంబి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో కేవలం 77 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు, కాయ ఒకే ధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8.000, గరిష్ఠ ధర రూ.9,675, మోడల్ ధర రూ.9,425 పలికాయి. ధరలు తగ్గుతుండటంతో పసుపు విక్రయాలకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

14 నుంచి బస్‌పాసులు జారీ

మంగళగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు ఈ నెల 14 నుంచి కొత్త బస్‌పాసులను జారీ చేయనున్నట్టు డిపో మేనేజరు రెంటపాళ్ల పిచ్చిరెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి పాసులు తీసుకోదలచిన విద్యార్థులు వారి వివరాలను ఏపీ ఎస్ఆర్టీసీ వెబ్‌సైటు ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని 14 నుంచి బస్‌పాస్ కౌంటర్ వద్దకు రావాలని సూచించారు. ఈ నెల 12, 13 తేదీల్లో రెండు రోజులపాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ నిమిత్తం బస్‌పాస్ కౌంటరు మూసివేయబడుతుందని తెలిపారు.

మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం

కాకుమాను, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం సరఫరా చేసిందని మండల విద్యాశాఖాధికారి కె.ఎఫ్ కెన్నడి తెలిపారు. మండల వ్యాప్తంగా 36 ప్రభుత్వ పాఠశాలల్లో 2386 మంది విద్యార్థులకు సన్నబియ్యంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం పాఠశాలల పునః ప్రారంభం రోజు నుంచే అమలు చేస్తామన్నారు. 9824 పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లతో కూడిన కిట్లను కూడా అందించనున్నట్లు తెలిపారు.

కీ॥శే॥ కొల్లిమర్ల హనుమంతరావు, S/o. గోపాలస్వామి, మల్లిఖార్జునరావుపేట, గుంటూరు వారి ఆస్తుల గురించి ప్రకటన.

మా క్లయింటు కొల్లిమర్ల ప్రేమ్‌కుమార్, S/o. హనుమంతరావు, ఫ్లాట్ నెం.302, సాయినాథటవర్స్, రామిరెడ్డిపేట, నరసరావుపేట, పల్నాడుజిల్లా వారి సంజాయిషీ మేరకు తెలియజేయునది ఏమనగా, మాక్లయింటు యొక్క అక్కగారైన దిట్టకవి పద్మావతి, భర్త, ఫణికుమార్ తన కుటుంబ సభ్యులతో కుమ్మక్కై తన తండ్రి కొల్లిమర్ల హనుమంతరావు,S/o.గోపాలస్వామి వారి దిగువ షెడ్యూలు స్థిరాస్తిని అక్రమంగా పుట్టించిన దస్తావేజులను ఆధారంగా అమ్మబోవుచున్నారని తెలిసింది. హనుమంతరావుగారు వారి ఆస్తులపై ఏవిధమైన వ్రాతపూర్వక ఏర్పాట్లు చేయకుండానే ఇంటస్టేట్‌గా స్వర్గస్తులైనారు. కావున చట్టప్రకారం సదరు హనుమంతరావుగారి భార్య లక్ష్మీనరసమ్మ, వారి కుమార్తెలు దిట్టకవి పద్మావతి, అట్లూరి విజయలక్ష్మీ మరియు నాక్లయింటు కొల్లిమర్ల ప్రేమ్‌కుమార్ గారలు వారి వారసులై వున్నారు. వీరికి 1/4వ వంతు హక్కు సదరు ఆస్తులలోయున్నది. ఏ ఒక్కరూ తమకు తామే హక్కుదారులై వున్నామని దస్తావేజులు సృష్టించి అమ్మజూపిన యెడల లేదా అమ్మిన యెడల అవి మాక్లయింటును చట్టరీత్యా బద్దులను చేయజాలవు మరియు మాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

షెడ్యూలు: గుంటూరు డి॥ & సబ్ డి॥, జి.యం.సి.ఏరియాలో చేరి టౌన్ సర్వే కానటువంటి గుంటూరు సిటీ, మల్లిఖార్జునపేట 1వ లైను నందలి గుంటూరు గ్రామం తాలూకు డి.నెం.172/1బిరు య.0-83సెంట్లున్నూ, డి.నెం.172/2ఏరు య.6-84సెంట్లున్నూ వెరశి య.7-67సెంట్లు భూమి ఏకఖండంగా వున్న య.3-74సెంట్లులో తూర్పు వైపు య.1-87సెంట్లు మింజుమలె య.1-00సెంట్లులో వేయబడినట్టి ప్లాట్లలో నెం.14రు ప్లాటు చ.గ.253ల స్థలం, యిందలి గ్రౌండ్‌ఫ్లోర్ ఆర్.సి.సి. డాబా, అందుపైగల ఏ.సి.సి. రేకుల ఇల్లు వగైరా, మునిసిపల్ అసెస్మెంటు నెం.1021040635రు, డోరు నెం.7-17-285రు గల ఆస్తికి **హద్దులు తూర్పు:**ప్లాటు నెం.15రు స్థలం హద్దు,అ.69లు,**దక్షిణం:**రోడ్డు హద్దు,అ.33లు, **పడమర:** కొల్లిమర్ల లక్ష్మీ నరసమ్మ గారు యితరులకు విక్రయించిన నెం.13రు స్థలం హద్దు,అ.69లు, **ఉత్తరం:**మొలకలూరి నరసింహారావు గారి ఆస్తి హద్దు, అ.33లు.

క్షత్రి శ్రీనివాస రాకూర్ సింగ్, కొమ్మవరపు మల్లేశ్వరరావు,అడ్వకేట్స్
డోర్.నెం.6-20-70, 12/1 అరండల్‌పేట, గుంటూరు. సెల్: 9848684277, 9491185782.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

● టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని



మాట్లాడుతున్న టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధానకార్యదర్శి పోతినేని

దుగ్గిరాల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సర్వనాశనం చేసిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం మెరుగుపరచి, పాలనను గాడిలో పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పోస్టర్‌ను బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా నిర్మాణానికి నోచుకోని దుగ్గిరాల రేవేంద్రపాడు రోడ్డు, దుగ్గిరాలలోని మెయిన్‌రోడ్ల నిర్మాణాలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఈ ఏడాదిలో చేపట్టామన్నారు. ఇచ్చిన హామీలను ఏడాది కాలంలోనే అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తదితరాలు అమలు కానున్నాయన్నారు. ఎంపీపీ షేక్ జబీన్ మాట్లాడుతూ ఏడాదిలో మండలంలో రూ.1417 లక్షల మేర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు.గూడూరు వెంకట్రావు, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, వల్లూరు నరసింహారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీఎంపీడీఓ జవహర్, పీఆర్‌డీఈ గుప్తా, సోషల్‌వెల్ఫేర్ డీఈ రాము, ఏఈ నరేంద్ర, ఏఎస్ డబ్ల్యు రామారావు, కార్యదర్శి వివేకానంద పాల్గొన్నారు.

నాడు లోకేశ్ హామీ.. నేడు అమలు

● రూ.3.5 కోట్లతో బాలికల వసతిగృహానికి శంకుస్థాపన

దుగ్గిరాలలో బాలికల వసతిగృహ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. తలుపులు సహా రక్షణ లేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఎస్సీ బాలికలకు అత్యాధునికంగా వసతిగృహాన్ని నిర్మిస్తామని గతంలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ అమలుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సెల్కాన్ సంస్థ సహకారంతో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతిగృహ నిర్మాణానికి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ జబీన్, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, రాష్ట్రవాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, కేసంనేని శ్రీఅనిత, డీసీ ఛైర్మన్ జి.అనిల్, వల్లూరు నరసింహారావు, సర్పంచ్ కుషీబాయి, వెంకటేశ్వరనాయక్, నక్కా చిరంజీవి, పర్వతనేని హర్ష, నాయుడు బాబూరావు, దేవరపల్లి చంటి, దేవదాసు, రవియాదవ్, వాసిరెడ్డి సుధాకర్, వైస్ ఎంపీపీ పి.సాయిచైతన్య, ఎం.రాము, ఎంపీటీసీ సాయికృష్ణ, తాళ్ల అశోక్‌యాదవ్, శంకర్‌నాయక్, శేషగిరి, ఏసుపాదం, బీజేపీ నాయకులు కొంగర జోగేంద్రప్రసాద్, చుండూరు ఉమామహేశ్వరరావు, పసుపులేటి గణేశ్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లో ఎస్సీ బాలికలకు వసతి

దుగ్గిరాలలోని బీసీ బాలుర వసతిగృహంలో తాత్కాలికంగా ఎస్సీబాలికల వసతిగృహాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అడిగొప్పుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండటంతో, ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతిగృహాలను ఎంపీపీ షేక్ జబీన్, తహసీల్దార్ ఐ.సునీత తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతిగృహం పడగొట్టి, రూ.3.5కోట్లతో అత్యాధునికంగా నిర్మించనున్న దృష్ట్యా విద్యార్థినులకు తాత్కాలిక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా బీసీ వసతిగృహంలో ఉంటున్న 22మంది విద్యార్థులను జడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలోకి తరలిస్తున్నట్లు తెలిపారు.



బాలుర హాస్టల్‌కి భూమి పూజ చేస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు, పాల్గొన్న కూటమి నేతలు

పెనుమాకలో బీసీ బాలుర హాస్టల్‌కి భూమిపూజ

తాడేపల్లి(పెనుమాక), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమాక గ్రామంలో రాడికో ఖైతాన్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో రూ.3.5 కోట్లతో నిర్మించనున్న బీసీ బాలుర బీసీ హాస్టల్‌కి బుధవారం ఏపీఎంఎస్‌డిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌ను అత్యాధునికంగా నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి శేషు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పఠాన్ జానీఖాన్, కాట్రగడ్డ మధు, పాలెపు వీరేంద్రనాథ్, పాలెపు రామారావు, గాదె శ్రీనివాస్, దాసరి కృష్ణ, వల్లభాపురం శంకర్ దంపతులు, గాదె వినయ్, కంచర్ల రంగరావు, షేక్ నాగులు, జనసేన నేతలు సామల నాగేశ్వరరావు, జొన్నా రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



పొగాకు మండెలను పరిశీలిస్తున్న అధికారులు

పొగాకు మండెలు పరిశీలన

పెదనందిపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అబ్బినేని గుంటపాలెంలో పొగాకు మండెలను బుధవారం అధికారులు పరిశీలించారు. త్వరలో పొగాకు కొనుగోలు చేస్తామని, నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టుబాకో బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ జీవన్‌కుమార్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఆర్‌జే కృష్ణారావు, ఏవో సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సంకర జాతి అంటే అగౌరవ పరచడమే

సజ్జలపై ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ధ్వజం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ఫిరంగిపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలను సంకర జాతి అంటూ సజ్జల మాట్లాడటం మహిళలను అవమాన పరచడమేనని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ధ్వజమెత్తారు. బుధవారం ఫిరంగిపురం విజ్ఞానపురంలో రూ.17 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించేందుకు వైసీపీ నేతలు బూతుల, రాజధానిపై బురదచల్లుతున్నారన్నారు. కూటమి విజయంతో ప్రస్తుతం రాష్ట్రం ప్రశాంతంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులు, నిర్బంధాలు, ఎస్సీ, ఎస్టీ కేసులతో ప్రజలను, ప్రతిపక్షాలను వేధించారన్నారు. తన పైనే 12 కేసులు పెట్టారని, తాను ఎస్సీనే ఐనా ఎస్సీ ఎస్టీ కేసు కూడా బనాయించారన్నారు. గత ప్రభుత్వంలో కొడాలి నాని, రాంబాబు, గోరంట్ల మాధవ్ ఇలాంటి అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు బూతులతోనే కాలక్షేపం చేశారన్నారు. విజ్ఞానపురానికి రూ.కోటితో కమ్యూనిటీ హాల్‌కు మంజూరు చేస్తామన్నారు. రాజకీయాల్లో మానవత విలువలు పెంచడానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జే ప్రసాదరావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, పసల తోమాస్, డీఈ కొండయ్య, ఏఈ శ్రీనివాస్, ఈవో ఏకే బాబు, సర్పంచ్ మేడా బాబు, పెరికల హృదయరాజు, కొలగాని కొండలు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ప్రసంగిస్తున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

మంగళగిరి సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి ఆటోనగర్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం, వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతులు సబ్సిడీలు లేక, అధిక వడ్డీలపై అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కౌలుదారుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకువచ్చి కౌలు రైతులకు ఇబ్బంది కలిగించే చర్యలను ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు పీ.రంగారావు, టీ.గోపాల్, ఎం.రామాంజనేయులు, బాల రంగారావు, సీతారెడ్డి, నాగమల్లేశ్వరరావు, పాశం రామారావు, బి.కోటేశ్వరి, పీవీ ఆంజనేయులు, ఎ.గోపాలరావు, కే.కల్యాణ్, ఈమని అప్పారావు, కే.శివనాగేశ్వరరావు, విజయలక్ష్మిపాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏరువాక

● సాగుకు రైతులు సన్నద్ధం



కాకుమాను: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వీఏఏ షణ్ముఖ క్షేత్రపాల్, ఏవో కిరణ్మయి, ఎంపీఈవో శివ ప్రసాద్ తదితరులు

పెదనందిపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు రైతులు ఘనంగా నిర్వహించారు. హిందూమత విశ్వాసాల ప్రకారం జ్యేష్ఠ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా పరిగణిస్తారు. కట్రపాడులో రైతుల అరక దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించి సాగుకు సన్నద్ధమవుతున్నారు.

కాకుమానులో..

కాకుమాను, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకుమానులో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి జరిగింది. వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి గ్రామానికి చెందిన నూతి సుబ్బారావు వ్యవసాయ క్షేత్రంలో భూమి పూజలో పాల్గొని రైతులకు పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు అందజేశారు. 30 రకాల విత్తనాలతో కూడిన పీఎండీఎస్ కిట్స్ రైతులకు వ్యవసాయ శాఖ పంపిణీ చేయనున్నట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు శివప్రసాద్, శ్వేత ప్రియ, షణ్ముఖ క్షేత్రపాల్, తదితరులు పాల్గొన్నారు.



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

తుళ్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అత్తోట పోతురాజు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ గోడ పత్రులను బుధవారం తుళ్లూరులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎం చిన వీరయ్య మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్ఐ ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో లక్ష్మీదేవి

పెదనందిపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగభైరువారిపాలెంలో ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డెయిన్ల పనులకు ఎంపీడీవో లక్ష్మీదేవి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, సర్పంచ్ దండా శాంతకుమారి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నువ్వుల ధనుంజయ్, పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు

తాడికొండ(లాం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఢిల్లీకి చెందిన మ్యాన్‌కైండ్ ఫార్మ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బీ.ఫార్మసీ, బీఎస్సీ, అర్హత సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. 17 మంది విద్యార్థులు పాల్గొనగా టెక్నికల్ రౌండ్, హెచ్.ఆర్. రౌండ్‌ను కంపెనీ ఏరియా మేనేజర్ లింగం పవన్‌కుమార్ నిర్వహించారు. వారిలో ముగ్గురు విద్యార్థులు రూ.3.5 లక్షలు వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామారావు, లింగం పవన్‌కుమార్

రూ.4.40 కోట్ల టోకరా

● చౌడవరంలో 43 నకిలీ డ్వాక్రా సంఘాలు సృష్టించి మోసం

గుంటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామంలో మరో ఘరానా మోసం వెలుగుచూసింది. నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి రూ.4.40కోట్లకు పైగా రుణాలు తీసుకొని మహిళలను మోసం చేశారు. సంబంధిత బ్యాంకు నుంచి బాధిత మహిళలకు నోటీసులు రావడంతో వారు కంగుతిన్నారు. బ్యాంకు నుంచి లోన్లు తీసుకోకపోయినా తాము డబ్బు చెల్లించాలంటూ నోటీసులు రావడంతో వారు బ్యాంకుకు పరుగులు తీశారు. బ్యాంకులో విచారించగా తమ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు రుణం తీసుకున్నట్లు గుర్తించారు. జీడీసీసీబీ, మెప్మా సిబ్బంది, గ్రామానికి చెందిన మరో మహిళతో పాటు కొందరు ముఠాగా ఏర్పడి ఈ భారీ మోసానికి పాల్పడినట్లు బాధితులు గుర్తించారు. బాధిత మహిళలు బుధవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నల్లపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధిత మహిళలు

ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్

గుంటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పోస్టింగ్‌లు కల్పించారు. తహసీల్దార్‌గా అడహాక్ ప్రమోషన్ పొందిన సిద్దెల హెనా ప్రియాని పెదనందిపాడు మండలం తహసీల్దార్‌గా నియమించారు. గుంటూరు తూర్పులో వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌పై తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ సుభానికి తూర్పు మండలంలోనే పోస్టింగ్ కల్పించారు. గుంటూరు జిల్లాకు కేటాయించిన కే సంధ్యశ్రీని మంగళగిరి తహసీల్దార్‌గా పోస్టింగ్ కల్పించి గుంటూరు కలెక్టరేట్‌లోని సీఆర్‌డీఏ అడ్మిన్ విభాగానికి వర్కింగ్ ఎరేంజ్‌మెంట్‌పై బదిలీ చేశారు. వీళ్లతోపాటు తొమ్మిది మంది డిప్యూటీ తహసీల్దార్లను కూడా బదిలీ చేశారు. డీవీ శివపార్వతిని కలెక్టరేట్‌లో, ఏ మాధవిని పొన్నూరు, ఎం వెంకటరావుని సివిల్ సప్లయిస్ గుంటూరు, సుభాస్ హెచ్ఆర్ శర్మని దుగ్గిరాల, కే కనకదుర్గని తాడేపల్లి, బిట్టు రమేష్‌ని గుంటూరు ఆర్‌డీవో ఆఫీసు, వై ధర్మతేజని కేఆర్ఆర్‌సీ, మునిపల్లి శివయ్యని మంగళగిరి ఎలక్షన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఇదేవిధంగా సీనియర్, జూనియన్ అసిస్టెంట్‌లు, ఆర్‌ఐలు, వీఆర్వో, వీఆర్ఏల బదిలీలు కూడా జరిగినట్లు సమాచారం.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పోస్టింగ్‌లు కల్పించారు. తహసీల్దార్‌గా అడహక్ ప్రమోషన్ పొందిన సిద్దెల హెనాప్రియాని పెదనందిపాడు మండలం తహసీల్దార్‌గా నియమించారు. గుంటూరు తూర్పులో వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్‌పై తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ సుభానికి తూర్పు మండలంలోనే పోస్టింగ్ కల్పించారు. గుంటూరు జిల్లాకు కేటాయించిన కే సంధ్యశ్రీని మంగళగిరి తహసీల్దార్‌గా పోస్టింగ్ కల్పించి గుంటూరు కలెక్టరేట్‌లోని సీఆర్‌డీఏ అడ్మిన్ విభాగానికి వర్కింగ్ ఎరేంజ్‌మెంట్‌పై బదిలీ చేశారు. వీళ్లతో పాటు తొమ్మిది మంది డిప్యూటీ తహసీల్దార్లను కూడా బదిలీ చేశారు. డీవీ శివపార్వతిని కలెక్టరేట్‌లో, ఏ మాధవిని పొన్నూరు, ఎం.వెంకటరావుని సివిల్ సప్లయిస్ గుంటూరు, సుభాస్ హెచ్ ఆర్ శర్మని దుగ్గిరాల, కే కనకదుర్గని తాడేపల్లి, బిట్టు రమేష్‌ని గుంటూరు ఆర్‌డీవో ఆఫీసు, వై ధర్మతేజని కేఆర్‌ఆర్‌సీ, మునిపల్లి శివయ్యని మంగళగిరి ఎలక్షన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఇదేవిధంగా సీనియర్, జూనియన్ అసిస్టెంట్‌లు, ఆర్ఐలు, వీఆర్‌వో, వీఆర్‌ఏల బదిలీలు కూడా జరిగినట్లు సమాచారం.



గరుడ వాహనంలో
స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

వైకుంఠపురంలో ఏరువాక పౌర్ణమి ఉత్సవం

తెనాలి అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం ఆలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి ఉత్సవం నిర్వహించారు. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. పంటలు బాగా పండాలని, రైతాంగం పచ్చగా ఉండి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలంటూ ఈ ఉత్సవం నిర్వహించామని ఈవో అనుపమ తెలిపారు. ప్రతి పౌర్ణమికి తిరుమలలో స్వామి వారికి గరుడసేవ చేస్తారని, ఇదే తరహాలో ఇక్కడ కూడా సేవ ప్రారంభిస్తున్నామని ప్రతి పౌర్ణమి రోజున జరిగే సేవలో భక్తులు రూ.516లు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయంలో నూరుశాతం ఉత్తీర్ణత

తెనాలి అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగడకోటయ్య నగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మహోన్నతం మహిళా మండలి సభ్యుల ఆశయం

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ ఆర్థికంగా ఎదగాలన్న మహోన్నతమైన ఆశయంతో మహిళా మండలి సభ్యులు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహిళా సాధికారత భవనం ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భవన దాతలు మహిళా మండలి సభ్యుల మంచి మనస్సును మంత్రి మనోహర్ కొనియాడుతూ శిరస్సువంచి నమస్కరించి వారిని ఘనంగా సత్కరించారు. మహిళా సాధికారతకు వారు అందించిన సేవలను కొనియాడారు. మంత్రి చూపిన ప్రేమాభిమానాలకు మహిళా మండలి సభ్యులు ఆనంద బాష్పాలతో తాము తీసుకున్న నిర్ణయం సరైనదేనని కూటమి ప్రభుత్వంతో తమ ఆశయాలు కొనసాగుతాయన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. సభలో దాతలు కస్తూరిభాయి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ఈ భవనం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. వయసు మీదపడటంతో వృద్ధాప్యం దరిచేరి సేవలను కొనసాగించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ భవనాన్ని ఎవరు ఆక్రమిస్తారోనన్న భయం తమను వెంటాడిందన్నారు. మంచి కార్యక్రమాలతో సేవలందించిన ఆ భవనం మంచి ప్రభుత్వానికి అప్పగించాలన్న ఆశయంతో దానిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మంత్రిమనోహర్‌కు భవనాన్ని మహిళా సాధికరతకు వినియోగించేలా బాధ్యత తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. అందుకు మంత్రి మనోహర్ సమ్మతించడంతో పాటు ఏ ఆశయంతో ఐతే దీనిని స్థాపించామో దానిని భావితరాల వారికి కూడా అందించేలా బాధ్యతగా నడుపుతామని హామీ ఇచ్చారని వివరించారు. అతి తక్కువ సమయంలోనే భవనాన్ని ఆధునీకీకరించి ప్రారంభించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. మెప్మా విభాగాన్ని ఇందులో ప్రారంభిస్తున్నారని తెలిసి మరింత ఆనందం కలిగిందన్నారు. ఈ విభాగం ద్వారా మహిళలు స్వయం సహాయక సంఘాలు వివిధ శిక్షణలు పొంది సొంత కాళ్లపై నిలబడే అవకాశం ఉంటుందన్నారు. భవనాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళ పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఖాళీ సమయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు భవనంలో నిర్వహించే వివిధ శిక్షణలను పొంది కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చేలా నిలవాలని కోరారు. ఆ నాడు ఎంతో గొప్ప ఆశయంతో మహిళా మండలిగా ఏర్పడి ఒక్కో సభ్యులు రూ.500తో మొదలు పెట్టి కాల క్రమేణా ఆ డబ్బులను దుర్వినియోగం చేయకుండా భవనాన్ని నిర్మించి దాని ద్వారా మహిళా సాధికారతకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఆ నాటి సభ్యులందరి కష్టమే ఈ భవన నిర్మాణమని, ప్రతి మహిళ సమాజంలో గౌరవప్రదంగా జీవించాలన్న తమ ఆశయాన్ని భావితరాలకు కూడా అందించాలనే ప్రభుత్వానికి అందించామన్నారు. ప్రభుత్వం కూడా దానిని కొనసాగిస్తుందన్న పూర్తినమ్మకం తమకుందన్నారు. ప్రతి మహిళ భవనంలో జరిగే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సబ్‌కలెక్టర్ సంజన సింహ మాట్లాడుతూ నేటి సమాజంలో గజం భూమి కోసం ఘర్షణలకు దిగుతున్న తరుణంలో రూ.కోట్ల విలువజేసే భవనాన్ని మహిళల అభ్యున్నతికి అందించడం గొప్పవిషయమన్నారు. రెవెన్యూపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళా మండలి సభ్యులను సత్కరించి
నమస్కరిస్తున్న మంత్రి మనోహర్

సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచుకోవాలి

ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి

కొల్లిపర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల ద్వారా రైతులు భూసారాన్ని పెంచుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగిలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రానున్న ఖరీఫ్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వాడుకోవాలన్నారు. మొక్కజొన్న పంట వేసిన రైతులు చొప్పను తగలపెట్టకుండా కలియదున్నటం మంచిదన్నారు. మొక్కజొన్న చొప్పను కలియదున్నటం వలన భూసారాన్ని పెంచుకోవచ్చునన్నారు. మాగాణిలో పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి విత్తనాలను చల్లి వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు కలియదున్ని భూమికి తగిన పోషకాలు అందించాలన్నారు. అదేవిధంగా ఎకరానికి 4టన్నుల పశువుల ఎరువును వేయడం వలన భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. పశువుల ఎరువుతో సూక్ష్మధాతువు లోపాన్ని కూడా నివారించుకోవచ్చునన్నారు. అనంతరం రైతులకు శాస్త్రవేత్తలు భూసార కిట్‌లను పంపిణీ చేశారు. సదస్సులో శాస్త్రవేత్త డాక్టర్ శివశంకర్, పశువైద్యాధికారి జయశ్రీ, వ్యవసాయశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్‌లను పంపిణీ చేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి

శారద సాహిత్యం నేటి సమాజానికి అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్

తెనాలి అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సమాజం కోసం రచనలు చేసిన శారద సాహిత్యం నేటి సమాజానికి అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ చెప్పారు. ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివేకా విద్యా సంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, సమాజ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ రంగాల్లో ప్రముఖులను యువత ఆదర్శంగా తీసుకోవాలని, మహిళలు పడే బాధలను రచయిత తన రచనల్లో అద్భుతంగా ప్రస్తావించే వారని, లెజండరీ పదానికి సరైన వ్యక్తి అని చెప్పారు. హోటల్ కార్మికుడిగా పని చేస్తూ తమిళనాడు నుంచి తెనాలి వచ్చి సాహితీ దిగ్గజంగా ఎదిగారని తెలిపారు. తమిళనాడులోని పుదుకోటలో నటరాజన్‌గా పిలువబడే శారద గొప్పతనాన్ని తెలియజేయనున్నట్లు చెప్పారు. కేంద్ర, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రచయితలకు పత్రికల నుంచి పారితోషికం అందడానికి ఆయన చేసిన తీర్మానమే దోహదపడిందని గుర్తుచేశారు. 1985లో ఆలూరి భుజంగరావు రచించిన పుస్తకాన్ని పునః ముద్రణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవిబాబు, చెరుకుమల్లి సింగారావు, వల్లూరు శివప్రసాద్, కొలసాని రాంచంద్, గుజ్జర్లమూడి కృపాచారి, ఉమారాజశేఖర్, సుబ్రహ్మణ్యం, రచయిత కుమార్తె శారద, ఉషారాణి, రవీంద్రనాథ్, మొవ్వా సత్యనారాయణ, లలితానంద ప్రసాద్, కాటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శారద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శివశంకర్ తదితరులు

కొండమూది సర్పంచ్‌కి మాతృవియోగం

పొన్నూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండమూది గ్రామ సర్పంచ్ కరెడ్ల సుబ్బారావు మాతృమూర్తి గౌరిలక్ష్మి బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సుబ్బారావును ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకుడు మాదాల వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, సీతారామయ్య తదితరులు గౌరిలక్ష్మి మృతదేహానికి నివాళులు అర్పించారు.

విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు: ఈఈ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగించిన, చౌర్యానికి పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ ఆధ్వర్యంలో చేబ్రోలు పరిధిలోని గొడవర్రు, గుండవరం, మంచాల, శేకూరు, తోట్లపాలెం, ఉప్పరపాలెం, వడ్లమూడి, వేజెండ్ల, నారాకోడూరు, చేబ్రోలు గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 18మంది అధికారులు, 112మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి 3969 సర్వీసులను తనిఖీ చేశారు. మీటర్ లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న వారి నుంచి 2వేలు, మీటర్ ఉన్నప్పటికి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.60వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలలో విద్యుత్ వాడుతున్న వారికి రూ.58వేలు, అదనపు విద్యుత్ వాడుతున్న 33 మందికి రూ.2,67 లక్షలు, వాడకం కన్నా బిల్లు తక్కువుగా ఉన్న మూడు సర్వీసుల నుంచి రూ.35వేలు, మొత్తం రూ.4.2 లక్షల అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీలలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జున ప్రసాద్, రాజశేఖర్‌బాబు, కె.రాజశేఖర్, విజిలెన్స్ ఏఈలు కోటేశ్వరావు, సతీష్‌కుమార్, శివశంకర్, ఆపరేషన్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

పొన్నూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ. 5వేల జరిమానాను బుధవారం సెషన్స్ కోర్టు విధించింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం 2022లో పొన్నూరు మండలం మామిళ్లపల్లి అడ్డరోడ్డు వద్ద పెదకాకాని గ్రామానికి చెందిన తోటకూర సతీష్ మినీ ట్రక్‌ను నిర్లక్ష్యంగా, అతివేగంతో నడిపి రెండు ప్రమాదాలకు కారణమయ్యాడు. ఓ ప్రమాదంలో ప్రత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన ఉప్పాల రామారావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా మరో ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ కేసులో విచారణ జరిపిన బాపట్ల సెసెన్స్ కోర్టు జడ్జి జి.వాణి పోలీసులు ప్రవేశపెట్టిన సాక్షాలు రుజువుకావడంతో ముద్దాయి తోటకూర సతీష్‌కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానాను విధించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఘనంగా కోదండ రామాలయం వార్షికోత్సవం

పొన్నూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిముక్కలలోని కోదండ రామస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయంలో కొలువు దీరిన శ్రీసీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామి, శ్రీసిద్ధివినాయకస్వామి మూల విరాట్‌లకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెల పూజ జరిగింది. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ అర్చకులు చిలకపాటి వీర రాఘవాచార్యులు, దేవరాజస్వామి ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



ప్రత్యేక పూజలందుకున్న
కోదండ రాముడు

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● మండల వైద్యాధికారి నీహ

కొల్లిపర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు, గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి నెలా గర్భిణులు పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. గర్భిణులు వ్యాధినిరోధక టీకాలను నిర్ణీత సమయంలో తప్పకుండా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్ఎం జ్యోతి, డీఈవో బొమ్మ కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు సీతామహాలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ విలేజ్‌లుగా చేసేందుకు డిజిటల్ సేవలు అవసరం

● కేంద్ర ప్రభుత్వ టెలీకమ్యూనికేషన్ డైరెక్టర్ ప్రవీణ్

పొన్నూరు టౌన్, (చేబ్రోలు) జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్మార్ట్ విలేజ్‌లుగా అభివృద్ధి చేయడానికి డిజిటల్ సేవలు అవసరమని కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ డైరెక్టర్ ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరులో బుధవారం కేంద్ర బృందం స్మార్ట్ విలేజ్‌లో డిజిటల్ సేవలు అంశంపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా స్పందన, అనే అంశాలపై టెలికమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల క్షేత్రస్థాయి సర్వేని అధికారులు నిర్వహించారు. ఈ సర్వే నివేదికను గ్రామ సభలో టెలీకమ్యూనికేషన్ అధికారులకు అందించారు. గ్రామంలో ఆరోగ్య సేవలు, నుంచి ప్రతి ప్రభుత్వ సేవ ప్రజలకు డిజిటల్ విధానంలో అందించేలా ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన వ్యవసాయ సేవలు, భద్రత, ఈ కామర్స్, లాజిస్టిక్, బ్యాంకింగ్, బీమావంటి ప్రభుత్వ సేవల విభాగాలలో డిజిటల్ ద్వారా సేవలు అందించనున్నట్లు చెప్పారు. అలాగే విద్యార్థులకు ఉచిత పబ్లిక్ ఇంటర్నెట్, పాఠశాలలు, మార్కెట్‌లో పబ్లిక్ వైఫై వంటి సేవలను అందించడానికి స్మార్ట్ విలేజ్ సేవలు ఉపయోగపడతాయాన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ టెలీ కమ్యూనికేషన్ డివిజన్ లెవల్ అధికారి రాధిక, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఊహారాణి, విద్యాశాఖాధికారి సుబ్బారావు, వైద్యాధికారి అబ్రహం లింకన్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సుల్తానాబాదులో పావు రాజు దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. గత నెల 27న రాజు భార్య, పెద్ద కుమారుడుతో కలసి పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకువెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి వారి చిన్న కుమారుడు పావు గోపాల అలియాస్ టీకు (14) కనిపించలేదు. బంధువులను చుట్టుపక్కల వారిని విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో బుధవారం బాలుడి తండ్రిని పోలీసులను ఆశ్రయించాడు. బాలుడి తండ్రి పిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి బ్లూ రంగు టీషర్టు ఎరుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లోగాని 9341316341, 9440796274, 08644228417లో సంప్రదించాలని త్రీటౌన్ పోలీసులు కోరారు.



బాలుడు గోపాల
(ఫైల్ ఫొటో)

మున్సిపల్ కమిషనర్ శేషన్నకు ఆత్మీయ వీడ్కోలు

తెనాలి, మారీసుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు ఆత్మీయ వీడుకోలును మున్సిపల్ అధికారులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వీడ్కోలు సత్కార సభను మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తహసీల్దార్ గోపాలకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి పురపాలక సంఘంలో 18 నెలలు మున్సిపల్ కమిషనర్‌గా శేషన్న సమర్థవంతంగా విధులను నిర్వహించారన్నారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న విధినిర్వహణలో సహకరించిన అధికారులకు, కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆర్వో రాంప్రసాద్, అసిస్టెంట్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు శివన్నారాయణ, వీణ, మేనేజర్ జయకర్, ఎంఈ శ్రీనివాసరావు, ఏఈలు సూరిబాబు, సునీల్‌కుమార్, వైస్ ఛైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు టి.రామయ్య, పి.లక్ష్మీలావణ్య, మానసారెడ్డి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనర్ శేషన్నను సత్కరిస్తున్న
తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు

ఎడ్ల పందేల నిర్వహణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ వద్ద నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శనకు సహకరించిన దాతలకు కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. క్వారీ దేవాలయం వద్ద బుధవారం జరిగిన సమావేశంలో జమా ఖర్చుల వివరాలను వెల్లడించారు. మాజీమంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ పేరుతో నిర్వహించిన ఈ బల ప్రదర్శన పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 131 ఎడ్ల జతలు హాజరయ్యాయన్నారు. పోటీల నిర్వహణకు రూ.66,90,270 ఖర్చు అయినట్లు వివరించారు. రూ.63,90 లక్షలు దాతల నుంచి అందజేశారన్నారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు రూ.24.86 లక్షలు బహుమతులుగా అందించామన్నారు. రూ.2.41లక్షలు ప్రోత్సాహక బహుమతులు, 8రోజుల ఇతర నిర్వహణ ఖర్చులు రూ.39.63లక్షలు అయినట్లు చెప్పారు. దాతలకు సహకరించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు కమిటీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

అగ్నిమాపక అధికారిగా వేణుగోపాలరావు బాధ్యతల స్వీకారం

తెనాలి, మారీసుపేట,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి అగ్నిమాపక కేంద్రం అధికారిగా జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్‌గా ఎస్.వేణుగోపాలరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నెల్లూరులో విధులు నిర్వర్తించిన ఆయన తాజా బదిలీలో భాగంగా తెనాలిలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కృష్ణారెడ్డి బదిలీపై వెళ్లడంతో ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాలరావుకు సిబ్బంది అభినందనలు తెలిపారు.